
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
మంగళవారం 23 జూలై 2024


ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 22: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు తమ సమస్యలను విన్నవించి అర్జీలు సమర్పించారు. ఈసంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు పరిశీ లించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ రీ ఓపెనింగ్ లేకుండా పరిష్కారాలు ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల చేతుల్లో..

అటవీ భూములు



జగన్ ఐదేళ్ల పాలనలో సహజ వనరులు భారీగా లూటీ చేశారు. ఒక్క గాలి తప్ప అన్నింటిని అడ్డగోలుగా ఆక్రమించేశారు. వాటిలో ప్రధానమైనవి భూములు. జగన్ సీఎం కాకమునుపు ప్రభుత్వ భూములను లబ్ధిదారులతో పాటు పేదలకు పంపిణీ చేసేవారు. అయితే జగన్ సీఎం అయిన తర్వాత సర్వం మారిపోయింది. ప్రభుత్వ భూములే కాదు వాగులు, వంకలు, కాల్వలు ఆక్రమిం చేశారు. చివరకు ప్రైవేటు స్థలాలు సైతం కొల్లగొట్టారు. అయితే చివరకు అటవీశాఖ భూములు కూడా వదల్లేదు.



- మాజీ ఎమ్మెల్యే అనుచరులకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు
- అటవీశాఖకు సహకరించని వైనం
- ప్రభుత్వం మారినా.. అధికారుల్లో కనిపించని మార్పు
- ఇంకా పులివెందుల పెత్తనం పరిధిలోనే అధికారులు


అటవీశాఖ భూముల్లో సాగులో ఉన్న పండ్ల తోటలు

కడప, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖకు సంబంధించిన భూముల్లోకి, కొండల్లోకి అడుగుపెట్టాలంటే సవాలక్ష నిబంధనలు ఉంటాయి. అటవీశాఖ పరిధిలో టవర్ నిర్మించుకోవాలనుకున్నా అనుమతి తప్పనిసరి. అయితే అలాంటి శాఖ భూములనే జగన్ పాలనలో వైసీపీ నేతలు కొల్లకొట్టారు. భూములను ఆక్రమించేసి, ఫెన్సింగ్ వేసి దర్జాగా పండ్లతోటలు సాగుచేస్తున్నా కూడా అడ్డుకునే దమ్ము ధైర్యం అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ చేయలేకపోయింది. అప్పట్లో జిల్లా రెవెన్యూ అధికార యంత్రాంగమే వైసీపీకి జీహుజూర్ అనడంతో కళ్లముందే భూములు అక్రమణకు గురైనట్లు తెలిసినా కూడా పట్టించుకునేనాథుడే లేడు. ఈ వాస్తవాలను ఆంధ్రజ్యోతి, కొన్ని మీడియాలు వెలికితీస్తే అవి ఎల్లో మీడియా అంటూ దాట వేశారు. ఎవరో చట్టాలపై అవగాహనలేని, చదువురాని రైతులు వ్యవసాయంపై మమ కారంతో అటవీభూములు సాగుచేస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధులే భూకబ్జాలకు పాల్పడడం గమనార్హం. ఎకరా రెండుఎకరాలు కాదా ఏకంగా 300పైచిలుకు ఎకరాల అటవీశాఖ భూమిని దర్జాగా కబ్జాచేసి చుట్టు ఫెన్సింగ్ వేసి పండ్లతోటలు పెంచుకోవడం గమనార్హం.

పేదవాడు సెంటు స్థలం ఇంటి కోసం ఆక్రమించినా.. లేదా పొలం పక్కనున్న కొంచెం సాగినా, ఇటు కుటుంబ పోషణ కోసం వంట చెరుకు కోసం అడవిలోకి వెళ్లిన అటవీశాఖ అధికారులు తమ ప్రతాపం చూపిస్తారు. మరి వందల ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి.. అది అటవీశాఖ భూమి అని తెలిసినప్పటికీ రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయడమే తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో అంటూ భూములు సాగుచేశారు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చినా ఇంకా అధికారుల్లో మార్పు రాకపోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది. మైదుకూరు నియోజకవర్గంలోని నంద్యాలంపేట సర్వేనెంబర్ 506బీ, 507లో 304 ఎకరాల అటవీశాఖ భూమి ఉంది. ఇది చాలా సారవంతమైన భూమి. చుట్టుపక్కల సమీపంలో వ్యవసాయ భూములకు మంచి ధర ఉంది. అక్కడ ఎకరా రూ.20లక్షలకు పైనే ఉంది. సారవంతమైన భూమి కావడంతో ఏ పంటలైనా బాగా పండుతాయి. ఈ అటవీ శాఖ భూములు కూడా బాగా లెవెలింగ్ ఉండడంతో మైదుకూరుకు చెందిన మాజీ వైసీపీ నేత అధికారంలో ఉన్నపుడు కన్నుపడింది. పంటలు పండేందుకు బంగారంలాంటి సారవంతమైన భూమి కావడం, చేతిలో అధికారం ఉండడం... ఇంకేముంది ఆ భూమిపై కన్నేశారు. ఆయనతో పాటు ఆయన బ్యాచ్ భూకాలకేయుల్లా ఆ భూమిని చకచకా ఆక్రమణ చేసేశారు.

అటవీశాఖ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. అయితే వైసీపీ బ్యాచ్ అధికారంలో ఉండేది మేమే, మా అన్న ఇంకా 30 ఏళ్లు సీఎంగా ఉంటారు.. ఏ భూములు అయితే మాకేంటి, మా ఇలాకాలో మా పాలనలో అన్ని భూములు ఒకటే.. మాకు కావాలంటే ఇవ్వాల్సిందే, మా కన్నుపడితే మా చేతిలోకి రావాల్సిందే అనుకున్నట్లు ఉన్నారు. అంతే అవి అటవీశాఖ భూములు అయిన సరే ఆక్రమించేశారు. ఆక్రమిత భూమికి ఫెన్సింగ్ వేశారు, బోర్లు వేసి పండ్ల తోటలు వేశారు. ఇక రెవెన్యూ రికార్డుల్లో కూడా వాటిని మార్చేసుకున్నారు. ఇందులో మాజీ ప్రజాప్రతినిధి పేరిటనే వంద ఎకరాలు ఉందని చెబుతారు. ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధే కక్కుర్తిపడి అటవీశాఖ భూములు కొట్టేయడం విమర్శలకు తావిస్తోంది. ఏదైనా ప్రాజెక్టుకు సంబంధించి అటవీశాఖకు చెందిన భూములు తీసుకుంటే బదులుగా ఎక్కడోచోట భూములు కేటాయించాల్సిందే. మన భూవిస్తీర్ణంలో అటవీశాఖకు ఎంతో కీలకమైన పాత్ర ఉంది. అటవీశాఖ నుంచి అనుమతులు కావాలంటే మామూలు విషయం కాదు. పర్యావరణ శాఖ అన్నీ పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇస్తారు. అయితే కఠినమైన చట్టాలు ఉన్నా అటవీశాఖ భూములు కూడా చాలా ఈజీగా ఆక్రమించేసి బోర్లు వేసి చెట్లు నాటి రికార్డుల్లో పేరు మార్చుకోవడం జగన్ పాలనలో సాగింది.

పుట్టా సుధాకర్ యాదవ్ పోరాటం

అటవీ శాఖ భూమే కాదు.. ఇసుక అక్రమ రవాణా ఇతరత్రా మైదుకూరులో జరిగిన వాటిపై ప్రస్తుత ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అప్పట్లో ఫైట్ చేశారు. ఇసుక తవ్వ కాలు, తప్పుడు కేసులపై ఎదురొడ్డి నిలబడ్డారు. ఇక అటవీశాఖ భూములపై సుధాకర్ యాదవ్ చెన్నైలోని గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి వివరాలు సమర్పించారు. అయితే ప్రభుత్వం మారినా కూడా ఇంకా వైసీపీ చేతుల్లో ఆ భూములు ఉండడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్కడున్న వాటిని తొలగించి.. స్వాధీనం చేసుకుందామ నుకుంటే రెవెన్యూ వారు సహకరించడం లేదంటూ అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా రెవెన్యూలో కొందరు వైసీపీ ఫ్యాన్స్ ఉన్నారు. పులివెందుల పెత్తనం కిందనే పనిచేస్తున్నారంటూ ఇక్కడ జరిగిన అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు : అదనపు ఎస్పీ


అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కడప క్రైమ్, జూలై 22: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదులపట్ల నిర్లక్ష్యం తగదని.. ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్ సూచించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. సెబ్ అదపు ఎస్పీ వెంకటరాముడు, డీటీసీ డీఎస్పీల ఆధ్వర్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీ లించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేశారు. పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యలు విని పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, గ్రీవెన్స్‌సెల్‌లో కొందరు బాధితులు అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేసిన మేరకు...

నా భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించారు..

మాకు కె.సుగుమంచిపల్లెలో 1.68 ఎకరాల భూమి ఉంది. అయితే 33 సెంట్ల స్థలాన్ని వైసీపీ నేతలైన టీసీ కృష్ణారెడ్డి, రంగనాథరెడ్డి, రిటైర్డు తహశీల్దార్ ప్రభాకర్‌రెడ్డి, పుల్లయ్య కలసి ఆక్రమించి రికార్డులను మార్చారు. వీరిపై తాళ్ళప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తమ స్థలంలోకి వెళుతుంటే పై వారు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రస్తుత డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వరి కూడా వారికి సహకరిస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

- చిన్నారెడ్డి, కె.సుగుమంచిపల్లె, కొండాపురం మండలం

భూమి రికార్డును తారుమారు చేశారు..

మా పొలానికి సంబంధించి 1994 నుంచి రికార్డు ఉంది. తన తండ్రి ముప్పై సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బద్వేల్ ఆర్డీఓ ఆఫీస్‌లో పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య, విలేజ్ సర్వేయర్ ఈశ్వరయ్య, సచివాలయ ఇన్‌చార్జ్ వీఆర్‌ఓ గుర్రప్పలు కలసి తప్పుడు రిపోర్టులు రాయించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంతో పాటు మా పొలంలో 39సెంట్ల భూమిని సొదరి సుబ్బారెడ్డి పేరుమీద నమోదు చేసి.. నకిలీ రికార్డులు తయారు చేయించారు. తాము తమ పొలంలోకి దిగుతుంటే గొడవలు సృష్టిస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- మాసాని చిన్న వెంకటసుబ్బన్న, పెద్దుళ్లపల్లి, బి.కోడూరు మండలం

ఓఖా వీక్లీ రైలు దారి మళ్లింపు

కడప ఎడ్యుకేషన్, జూలై 22: కడప మీదుగా నడిచే మదురై, ఓఖా వీక్లీ రైలు (09519) ఈనెల 26న దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. బాలుపల్లె, మామండూరు మధ్య రైల్వే బ్రిడ్జి పనులు జరుగుతుండడంతో ఈ రైలును దారి మళ్లించడం జరిగిందన్నారు. 26వ తేదీ కాట్పాడి నుంచి పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓఖాకు రైలు వెళ్లనుందని చెప్పారు. రేణిగుంట కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రిలకు ఈ రైలు రాదని చెప్పారు.

నంద్యాల డెమో రైలు పాక్షిక రద్దు

నంద్యాల-రేణిగుంట-నంద్యాల మధ్య కడప మీదుగా నడుస్తున్న నంద్యాల డెమో (07284-07285) రైలు ఈనెల 26వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేశారు. బాలుపల్లె, మామం దూరు మధ్య రైల్వే బ్రిడ్జి పనులు జరుగుతుండడంతో ఈ రైలును నంద్యాల నుంచి కడప, కడప నుంచి నంద్యాల వరకు మాత్రమే నడవనుంది.

గ్రామీణ పేదలకు వరం.. ట్రిపుల్‌ఐటీలు

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 427 మందికి ప్రవేశాలు
- ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మొదటి అడ్మిషన్ ఫైల్‌ను ఎం.మహేష్‌బాబుకు అందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, జూలై 22: గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలు వరంలాంటివని, ఇక్కడ వచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం ప్రవేశాలు కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన చదువుతో పాటు వసతి కల్పి స్తామని.. క్రమశిక్షణతో చదువుకుని ట్రిపుల్‌ఐటీలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కనీసం నెలకు ఒకసారి అయిన విద్యార్థులను చూసు కునేందుకు వచ్చి ఏవైన లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని డైరెక్టర్ తల్లిదండ్రులకు తెలిపారు.

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు మొదటిర్యాంకు సాధించిన సత్య సాయి జిల్లా తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లె గ్రామానికి చెందిన ఎం.మహేష్ బాబుకు అడ్మిషన్ ఫైల్‌ను డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, డీన్ రత్నకు మారిలు అందించారు. అనంతరం అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించారు. 515 మంది విద్యార్థులకు మొదటి రోజు హాజరు కావాలని కాల్‌లెటర్లు పంపగా.. 427 మంది హాజరై ప్రవేశాలు పొందారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డీన్‌లు కోటేశ్వరి, ఇమ్రాన్, చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, బిన్ని, పీఆర్వో తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో అడుగిడిన విద్యార్థులు


అడ్మిషన్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉన్నత విద్యా అవకాశాలు పొందేందుకు.. తల్లిదండ్రులు తమపై ఉంచుకున్న కలలను సాకారం చేసుకునేందుకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు కోటి ఆశలతో క్యాంపస్‌లో అడుగిడారు. వీరిలో చాలా వరకు పేద కుటుంబాలకు చెందిన వారే. రైతులు, రైతుకూలీలు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారి పిల్లలు ఉన్నారు. వీరంతా పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ట్రిపుల్‌ఐటీలో అవకాశం దక్కింది.

అవినీతి సిబ్బందిపై కొరడా

- ముగ్గురు రెవెన్యూ అధికారులు సస్పెన్షన్
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (కలెక్టరేట్), జూలై 22: రెవెన్యూలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు రెవెన్యూ అధికారులపై కలెక్టర్ లోతేటి శివశంకర్ కొరడా ఝుళిపించారు.. అవినీ తికి పాల్పడిన ముగ్గురిని సస్పెండ్ చేశారు. ఈనెల 16వ తేదీ బి.కోడూరు మండలంలోని గోవిందాయపల్లిలో 'జడ్పీ హైస్కూలు తనఖా.. సహకరించిన రెవెన్యూ అధికారులు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో పతాక శీర్షికలో ప్రచురితమైంది. ఈ విషయంపై స్పందించి.. విచారణ జరిపిన కలెక్టర్ తక్షణమే డిప్యూటీ తహశీల్దారు విద్యాసాగర్, గ్రామ సర్వేయర్ ఎ.ప్రవీణ్‌కుమార్, వీఆర్వో జె.గురవయ్యలను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బద్వేలు రెవెన్యూ డివిజన్ బి.కోడూరు మండలం మున్నెల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 755లో 4.27 ఎకరాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు (1985లో) చెందిన స్థలాన్ని డీటీ విద్యాసాగర్ (ఎఫ్ఎసీ), గ్రామ సర్వేయర్ ప్రవీణ్‌కుమార్, వీఆర్వో గురవయ్యలు కలసి రెవెన్యూ రికార్డును పరిశీలించకుండా, ప్రాథమిక విచారణ చేయ కుండా... నిబంధనలకు వ్యతిరేకంగా కొండా వెంకటసుబ్బమ్మకు మ్యుటేషన్ చేశారు. దీంతో కొండా వెంకటసుబ్బమ్మ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మార్టిగేజ్ చేసి రూ.8లక్షలు రుణం తీసుకుంది. ఈ మొత్తం వ్యవహారంపై బద్వేలు ఇన్‌చార్జి ఆర్డీవో చంద్రమోహన్‌ను విచారణ అధికారిగా నియమించి.. కలెక్టర్ నివేదికను తెప్పించుకున్నారు. విచారణలో దురుద్దేశ్యంతో అవినీతికి పాల్పడినట్లు తేల డంతో ముగ్గురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశారు. ఇకపై ఏ అధికారి అయినా చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశ్వవిద్యాలయ ప్రగతికి కృషి

- ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతలు చేపట్టిన విశ్వనాథకుమార్


బాధ్యతలు చేపడుతున్న ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, జూలై 22: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ప్రగతికి కృషి చేస్తామని ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. సోమ వారం వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ఆయన బాధ్యతలను స్వీకరించారు. అలాగే ఆయనకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎస్.రాజేష్ కుమార్‌రెడ్డి పూలబొకేతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యా ర్థులకు నాణ్యమైన బోధన అందిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమి, నిధులు, అనుమతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

సబ్ కలెక్టరేట్‌లో మిస్టరీ మంటలు..!

- కాలిపోయిన కార్యాలయంలోని ఫైళ్లు
- పెద్దిరెడ్డి కుటుంబం హస్తంపై అనుమానం
- డీజీపీ, సీఐడీ చీఫ్, ట్రాన్స్‌కో సీఎండీ విచారణ
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్రిక్తత


సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎగసిపడుతున్న మంటలు

మదనపల్లె, జూలై 22: మదనపల్లెలో మిస్టరీ మంటలు కలకలం సృష్టించాయి. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో రెవెన్యూకు సంబంధించిన కీలకమైన ఫైళ్లు దగ్ధమయ్యాయి. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ఇతర ప్రజాసంఘాలు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగాయి. ఇదంతా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పనే అంటూ ఆరోపించారు. అయిదేళ్ల వైసీపీ కాలంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు ఏరియాలలో పెద్దిరెడ్డి కుటుంబం వివిధ మార్గాల్లో ఆక్రమించిన భూమిగా పేర్కొన్నారు. పేదల నుంచి వీరు దౌర్జన్యంగా ఆక్రమించిన, ప్రభుత్వ, ప్రైవేటు భూములు వేల ఎకరాలు కబ్జా చేశారని, వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు తిరిగి ఇచ్చేస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ భూములకు సంబంధించిన కీలక ఫైళ్లను లేకుండా చేయడంలో భాగంగానే గుర్తుతెలియని దుండగులు ఫైళ్లకు నిప్పు పెట్టారని ధ్వజమెత్తారు. దీని వెనుక పెద్దిరెడ్డి కుటుంబం హస్తం ఉందని టీడీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ప్రజాసంఘాలు మండిపడ్డాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు..వెంటనే మదనపల్లెకు వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించడంతో డీజీపీ ద్వారకా తిరుమల రావు, సీఐడీ చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌లు ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. వీరిలో కలెక్టర్, ఎస్పీలు ఉదయాన్నే సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్యోగులను మినహా లోనికి ఎవరినీ అనుమతించలేదు. సంఘటన జరిగిన ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్న పోలీసులు క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు విజయవాడ నుంచి విమానంలో రేణిగుంటకు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మదనపల్లెకు చేరుకున్నారు. ఇక్కడికి చేరుకున్న డీజీపీ, సీఐడీ చీఫ్‌లు సాయంత్రం 6:30 గంటల వరకూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంఘటనపై ఆరా తీశారు. అంతకుముందు ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు, ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈలు రాజశేఖర్‌రెడ్డి, యుగంధర్, రవికుమార్, సంతోష్, తదితరులు విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని ఆర్డీవో హరిప్రసాద్, కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్తుశాఖ అధికారులు రంగప్రవేశం చేశారు. ఇది అగ్ని ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టి కీలకమైన ఫైళ్లు కాల్చేశారని, అటు స్థానికులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ ఆధ్వర్యంలోని ఎస్ఈ, ఈఈల బృందం సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. సంఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం విద్యుత్తు ప్రమాదంతో సంఘటన జరగలేదని తేల్చారు. ఇది విద్యుత్తు ప్రమాదం కాదని, మరేదైనా ఉండొచ్చని స్పష్టం చేశారు.


కార్యాలయంలో పూర్తిగా కాలిపోయిన ఫైళ్లు

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాద సంఘటనలో ఆర్డీవో చాంబర్, ఏవో చాంబర్‌లు మినహా అన్ని విభాగాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇందులో ముఖ్యంగా 22ఏ, ల్యాండ్ కన్వర్షన్, చుక్కల భూములు, ఆర్‌వోఆర్ అప్పీలు, ఎన్‌వోసీ, తదితర కీలకఫైళ్లు కాలిపోయాయి. ఈ విభాగాన్ని చూసే సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ ఆదివారం రాత్రి 11:45 గంటల వరకూ కార్యాలయంలో ఉన్నట్లు చెబుతున్నారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం వీఆర్వో రమణయ్య రాత్రి విధుల్లో ఉన్నారు. రాత్రి అక్కడే పడుకున్న వీఆర్‌ఏ అక్కడ మంటలు రావడాన్ని చూసి మొదటగా నిమ్మనపల్లె డిప్యూటీ తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో అప్రమత్తమైన ఆమె సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. పక్కనే ఉన్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గంటన్నరకుపైగా శ్రమించిన తర్వాత మంటలను అదుపులోకి తెచ్చినట్లు చెబుతున్నారు. అంతకుముందే అక్కడికి చేరుకున్న ఆర్డీవో హరిప్రసాద్ పరిస్థితిపై ఆరా తీశారు.

సోమవారం ఈ విషయం దావణంలా వ్యాపించడంతో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు అక్కడికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. డీజీపీ, సీఐడీ చీఫ్, ట్రాన్స్‌కో సీఎండీతో పాటు పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్రిక్తతతో పాటు హైడ్రామా నడిచింది. విచారణ అనంతరం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో డీజీపీ అక్కడికి చేరుకుని సంఘటనపై క్లారిటీ ఇచ్చారు. ఇది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్ అని వెల్లడించారు. కాగా, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిమాద ఘటనపై సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌ను, వీఆర్‌ఏ రమణయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అలాగే ఉద్యోగులందరినీ విచారించి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరి కాల్ డేటా ఆధారంగా విచారణలో ముందుకెళ్లాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది. ఇక మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మదనపల్లె డివిజన్‌లోని తహసీల్దార్లు ఎవరూ బదిలీ అయిన జిల్లాలకు వెళ్లొద్దని సోమవారం ఉదయం 11 గంటలకు ఉత్తర్వులు జారీ చేశారు.

నంది, గరుడ వాహనాలపై శివకేశవులు



నంది వాహనంపై ఊరేగుతున్న సిద్ధేశ్వర స్వామి

రాజంపేట, జూలై 22: తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య స్వయంగా అర్చించి సేవించిన సిద్ధేశ్వర, చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సిద్ధేశ్వరుడు నందివాహనంపై, చెన్నకేశవులు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చెన్నకేశవస్వామి మోహినీ అవతారంలో భక్తులకు కనువిందు చేయగా సిద్ధేశ్వరస్వామి పల్లకి సేవలో అభయమిచ్చారు. సాయంత్రం అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద గల ప్రధాన వేదికపై సిద్ధేశ్వర స్వామికి వేదపండితులు, అర్చకులు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సిద్ధేశ్వరస్వామి నందివాహనంపై, చెన్నకేశవస్వామి గరుడ వాహనంపై తాళ్లపాక మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు కనువిందు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రాధా గాయత్రి, ఎల్లయ్య, రమణమ్మ, శ్రీదేవి, లీలావతి, యశోద, కృష్ణ బృందాలు కోలాటాలతో భక్తులను ఆకట్టుకున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో తాళ్లపాక సామూహిక దేవాలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ గోపీ బాబు, ఆర్.స్వామినాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను తిలకించారు.

పంచలింగాల వద్ద అపరిశుభ్రంగా కోనేరు



అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి కోనేరు

సిద్దవటం, జూలై 22: వంతాటిపల్లె పంచాయతీ లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజయ్యస్వామి దర్శనానికి భక్తులు శివనామస్మరణతో కాలినడకన స్వామి దర్శనానికి చేరుకున్నారు. కాలినడక మార్గం పంచలింగాల కోన వద్ద తాగునీటి కోనేరు ప్లాస్టిక్ కవర్లతో పాచిపట్టి అపరిశుభ్రంగా ఉండడం, భక్తులు తెచ్చుకున్న నీటితోనే దాహం తీర్చుకుని తిరిగి కాలినడకన బయలుదేరారు. ఆలయ అధికారులు కోనేటిని శుభ్రం చేయకపోవడంతో కోనేరు అపరిశుభ్రంగా దర్శనమిస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం శివపార్వతుల కటాక్షం కోసం జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని, మొక్కుబడులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తులకు తాగునీరు అపరిశుభ్రంగా దర్శనం ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు తక్షణమే స్పందించి భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. ఈ విషయంపై ఆలయ సిబ్బంది చంద్రను వివరణ కోరగా కార్యనిర్వహణ అధికారి కోనేరు శుభ్రం చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని, రెండు రోజుల్లో శుభ్రం చేస్తామని తెలియజేశారు.

మారని గిరిజనుల రాతలు

నేటికీ గుడిసెల్లోనే గిరిజనులు ● కోట్లు విలువైన స్థలం నుంచి తరిమేశారు





నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ సమీప గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు - తమ గోడును ఆవేదనగా వివరిస్తున్న కాలనీ వాసులు

రాయచోటి టౌన్, జూలై 22: ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. నేటికీ గిరిజనులు గుడిసెల్లోనే తలదాచుకుంటున్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి పథకాలు చేపడుతున్న నేతలు వారు తలదాచుకునేందుకు మాత్రం గూడును కల్పించడంలో విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో సంక్షేమానికి కృషి చేస్తామని హామీలు గుప్పించే నేతలు గిరిజనుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక వదిలేస్తున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గిరిజనులకు ఎన్నో రకాల హక్కులను కల్పించినా అవి పూర్తి స్థాయిలో వారికి అందడం లేదు. నేటికీ అటు ప్రభుత్వాలు, ఇటు అధికారుల ద్వారా అగ్రవర్ణాల ద్వారా గిరిజనులు మాత్రం వివక్షకు గురవుతూనే ఉన్నారు. పట్టణం సహా జిల్లా పరిధిలోని కలకడ, గువ్వలచెరువు, సుండుపల్లె, సంబేపల్లె, గాలివీడు తదితర ప్రాంతాల్లో నేటికీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు కనిపించడం లేదు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధి నారాయణరెడ్డిగారిపల్లె వద్ద గల జగనన్న కాలనీ సమీప గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు పలురకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కోట్ల విలువైన స్థలం నుంచి తరిమేశారు

సుద్దలవాండ్లపల్లె రోడ్డులో ఇండస్ట్రియల్ ఏరియాకు సమీపంలో 50 ఏళ్లుగా తాతల కాలం నుంచి గుడిసెలు వేసుకుని పందులు మేపుతూ, బుట్టలు అల్లుకుంటూ జీవిస్తుండేవారు. ప్రస్తుతం వారుంటున్న స్థలం విలువ కోట్లాది రూపాయలు పలుకుతోంది. ఆ స్థలంపై కన్నేసిన అప్పటి వైసీపీ నేతలు వలంటీర్ల ద్వారా వారి ఆధార్‌కార్డులు సేకరించి వారికి చిల్లర పడేసి ఊరి బయటకు తరిమేశారు. సుమారు 70 కుటుంబాలకుపైగా గిరిజనులు సుద్దలవాండ్లపల్లె రోడ్డులోని బ్రహ్మంగారిగుట్టకు ఎదురుగా గుడిసెల్లో వారు నివసిస్తున్నారు. రాయచోటి పట్టణం అన్నమయ్య జిల్లా కేంద్రం కావడంతో అమాంతం భూముల ధరలకు రెక్కలు రావడంతో గుడిసెల్లో నివాసముంటున్న గిరిజనుల స్థలంపై కన్నేసిన కొందరు అప్పటి వైసీపీ ప్రస్తుత టీడీపీ నేతలు ఆ స్థలాన్ని ఖాళీ చేయించి ఎలాగైనా కాజేయాలని పథకం పన్నారు. అయితే గిరిజనులు ఖాళీ చేసేందుకు నిరాకరించడంతో నేతలు తెలివిగా ఆలోచించి అప్పటి వలంటీర్లను గిరిజనుల వద్దకు పంపించి మీరు పందులు మేపుకుంటూ, బుట్టలల్లుకుంటూ గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. మీ పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి లక్షల్లో ఇన్సూరెన్స్ వస్తుందని ఆశ చూపి గిరిజనుల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు సేకరించారు. వారి పేర్లతో ఊరి బయట అక్కడక్కడా కొన్ని డీకేటీ ఇంటి పట్టాలు సృష్టించి మీ పేర్లతో ఇంటి పట్టాలు వచ్చాయి. మీరు ఇక్కడ ఉండడానికి వీలు కాదు. ఖాళీ చేయాల్సిందే అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ స్థలంపై కన్నేసిన బడా నేతలు రంగ ప్రవేశం చేసి గిరిజనులతో మాట్లాడి కోట్ల విలువైన స్థలాన్ని లక్షల్లో చిల్లర పడేసి గుడిసెలను ఖాళీ చేయించి నారాయణరెడ్డిపల్లె సమీప జగనన్న కాలనీ వద్దకు తరిమేశారు. దీంతో గిరిజనులు చేసేది లేక జగనన్న కాలనీ సమీపంలో పక్క గ్రామ రైతు వద్ద రెండున్నరెకరాల డీకేటీ భూమిని కొనుగోలు చేసి అక్కడ గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్నారు.

వెంటాడుతున్న సమస్యలు

నారాయణరెడ్డిపల్లె వద్ద గల జగనన్న కాలనీకి సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న గిరిజనులను పక్కా గృహాలు, తాగునీరు, విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. సుమారు 70 కుటుంబాలకు పైగా గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం జగనన్న కాలనీలోకి వెళితే నీళ్లు మాకు సరిపోవడం లేదంటూ గిరిజనులను అక్కడికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రిళ్లు విషపురుగుల బారి నుంచి ప్రమాదాలు వెంటాడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా మా సమస్యలను పట్టించుకోకపోవడంతో నేరుగా మేమే సొంతంగా పక్క కాలనీ నుంచి సర్వీసు వైరు ద్వారా విద్యుత్ సరఫరా తెచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు తాగునీరు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులు చేసుకునే తాము పనులు మానేసి తాగునీటి కోసం పక్క కాలనీ, గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయని వాపోయారు. మా గోడును మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చొరవ చూపి మా కాలనీలో బోరు వేసి తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

తాగునీటి కోసం తప్పని ఇబ్బందులు



రాయచోటికి సమీపంలో ఉన్న మమ్మల్ని ఊరికి దూరంగా పంపించేశారు. ప్రస్తుతం నారాయణరెడ్డిపల్లె వద్ద గల జగనన్న కాలనీ సమీపంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాము. మా కాలనీలో తాగునీటి బోరు లేకపోవడంతో పక్కనున్న జగనన్న కాలనీకి వెళితే వారు రానివ్వడం లేదు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేసి మాకు గుక్కెడు నీరు ఇచ్చి ఆదుకోవాలి. నీటి కోసం కూలి పనులు కూడా మానేసి పక్క కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది.

- రమణ, గిరిజన కాలనీ, నారాయణరెడ్డిపల్లె, జగనన్న కాలనీ

ఉన్నతాధికారులు చొరవ చూపాలి



పక్కా గృహాలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా లేక ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్న గిరిజన కాలనీకి మౌలిక వసతులు కల్పించాలి. తాగునీటి కోసం జగనన్న కాలనీలోకి బిందెలు తీసుకుని వెళుతున్న గిరిజనులను స్థానికులు నీటిని తెచ్చుకోనివ్వడం లేదు. విద్యుత్ సరఫరా లేక రాత్రిళ్లు గిరిజనులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు గిరిజన కాలనీకి వసతుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేసి గిరిజన పిల్లలు విద్యకు దూరం కాకుండా చూడాలి

- అమావాస్య రెడ్డెయ్య, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు

శ్మశాన అక్రమితులపై చర్యలు తీసుకోండి

● ఎస్.ఎన్ కాలనీ వాసుల ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎన్ కాలనీ వాసులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 22: పెమ్మాడపల్లి రోడ్డు మార్గంలోని సర్వే నెంబర్ 801-1 లో విస్తీర్ణం 6.80 సెంట్లు డీకేటీ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, దీనిని వెంటనే ఆపాలని ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో కాలనీ వాసులు శివారెడ్డి, నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. చాలా కాలంగా హిందువులు చనిపోతే శ్మశాన వాటికలో అంత్రక్రియలు చేస్తూ వుండేవారు. అయితే దానిని కొందరు రియల్ ఎస్టేట్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని డీఆర్‌ఓకు ఇచ్చిన అర్జీలో పేర్కొన్నారు. గతంలో కూడా ఈ విషయంపై చాలా పెద్ద ఎత్తున గందరగోళం చేస్తే అప్పుడున్న తహసీల్దార్ ప్రభుత్వస్థలం అని బోర్డు ఏర్పాటు చేశారని వారు డీఆర్‌ఓకు వివరించారు. ఈ స్థలంపై చుట్టు వున్నా వారి కన్ను పడడంతో మెల్లమెల్లగా ఆక్రమణలకు పూనుకుంటున్నారన్నారు. ఈ విషయంపై చాలా సార్లు తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు వాపోయారు. మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకుని శ్మశాన వాటికను కాపాడవలసిన అవసరం ఎంతైనా పట్టణ ప్రజలు కోరుకోతున్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి : డీఆర్ఓ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ సత్యనారాయణ

రాయచోటి(కలెక్టరేట్), జూలై 22: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు డీఆర్ఓ సత్యనారాయణ సూచించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల వినతులు స్వీకరించిన వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన ప్రజలకు పరిష్కారం అందేలా అధికారులంతా క్షేత్రాస్థాయిలోకి వెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజలను పదేపదే కార్యాలయం చుట్టు తిప్పకుండా వారికి అర్థమయ్యేలా పరిష్కార మార్గం చుపాలన్నారు. వచ్చే వారంలోపు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండోలో సత్తా చాటిన కడప క్రీడాకారులు



మెడల్స్ సాధించిన బాల, బాలికలను అభినందిస్తున్న సురేష్‌బాబు

కడప (స్పోర్ట్స్) జూలై 22: ప్రొద్దుటూరు దేవాంగ కల్యాణమండపంలో ఈనెల 21న ఆదివారం జరిగిన జిల్లా స్థాయి తైక్వాండ్ పోటీల్లో కడప క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా తైక్వాండో సెక్రటరీ మాస్టర్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సుమారు 180 మంది బాల, బాలికలు పాల్గొన్నారు ఇందులో కడపకు చెందిన తైక్వాండో మాస్టర్ షేక్ జంషీర్ వద్ద శిక్షణ తీసుకున్న బాల, బాలికలు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఆ మేరకు సోమవారం కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు మెడల్స్ సాధించిన బాల, బాలికలను అభినందించారు.

'భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు'

కడప (మారుతీనగర్) జూలై 22: భవననిర్మాణ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు కేంద్ర భవన నిర్మాణ సలహామండలి చైర్మన్ శ్రీనివాసులునాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో భవననిర్మాణ రంగాన్ని కుదేలు చేసేలా జగన్‌రెడ్డి ఇసుకను బంగారం చేసి కార్మికులకు పనిలేకుండా చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 75 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికుల్లో కేవలం 30 లక్షల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మిగతావారు సరైన అవగాహన లేక రిజిస్ట్రేషన్ చేసుకోలేక పోయారన్నారు. దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి కేంద్రం, రాష్ట్రం ద్వారా అందే వివిధ పథకాలను అందిపుచ్చుకోలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సమయంలో అనుకోకుండా కార్మికుడు మరణిస్తే ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. కావున భవన నిర్మాణరంగ కార్మికులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, వివాహ, గర్భిణి, విద్య, ప్రమాద బెనిఫిట్స్ అందిపుచ్చుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'గండికోట'లో 1.6 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, జూలై 22: గండికోట ప్రాజెక్టులో సోమవారం సాయంత్రానికి 1.66 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం మైలవరం జలాశయానికి 410 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు డీఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదన్నారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పాము కాటుకు మహిళ మృతి



లక్ష్మమ్మ మృతదేహం

మైదుకూరు రూరల్ జూలై 22: అర్ధరాత్రి మరుగుదొడ్డికి వెళ్లిన ఇండ్ల లక్ష్మమ్మ (60) రక్తపింజరి కాటుకు గురై మృతి చెందిందని బంధువులు తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు, వెంకటసుబ్బయ్య కాలనీ వాసి ఇండ్ల లక్ష్మమ్మ ఆదివారం అర్ధరాత్రి బాత్రుమ్‌కు వెళ్లింది. ఇదే సమయంలో అక్కడ రక్తపింజరి పాము కాటుకు గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లగా మరణించినట్లు వారి బంధువులు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత ఆకుల క్రిష్ణయ్య వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం చేశారు.

మహిళపై అత్యాచార యత్నం

చాపాడు, జూలై 22: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై సోమవారం ఉదయం అత్యాచార యత్నం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశువులకు మేత పెడుతుండగా అదే గ్రామానికి చెందిన బయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆమెను పక్కకు తీసుకుపోవాలని ప్రయత్నించినట్లు తెలిపారు. ఆ మహిళ వెంటనే కేకలు వేయడంతో పలువురు గ్రామస్థులు, బంధువులు వెళ్లడంతో శ్రీనివాసులరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. బాధితురాలి భర్తతో కలిసి ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు

కడప క్రైం జూలై 22: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో రౌడీషీటర్ చింపిరి వెంకటేష్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ తిమ్మయ్య తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప అంబాభవాని నగర్ వాసి వెంకటేష్‌కు రవీంద్ర నగర్‌కు చెందిన సాధక్ వల్లి నడుమ మనస్పర్థలున్నాయి. ఈనెల 19వతేదీ రాత్రి బిల్టప్ వద్ద ఇద్దరూ మద్యం తాగినట్లు తెలిపారు. వారి నడుమ మాటామాట పెరిగిందని సాదక్ వల్లి మద్యం సీసాతో వెంకటేష్ గొంతుపై పొడిచి దారుణంగా హత్య చేసినట్లు తెలిపారు. ఈహత్య కేసులో నిందితుడు సాధక్ వల్లిని సోమవారం అతడి ఇంటివద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కడప క్రైం జూలై 22: కడప నగరం దేవుని కడపకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొగ్గుల గురులక్ష్మీ (32) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు దేవుని కడపకు చెందిన గురులక్ష్మీ మైసూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేది ప్రస్తుతం ఆమె వర్క్‌ఫ్రమ్ ఓమ్ ఇంటి వద్దనే పనిచేస్తోంది. భర్త విశ్వనాథ్, కొడుకు కుమార్తెతో ఇంటి వద్దే ఉంటున్నారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వైవీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పద్మ



ప్రొఫెసర్ పద్మకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, జూలై 22: వైవీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఇంగ్లీషు డిపార్టుమెంట్ ప్రొఫెసర్ పి. పద్మ, నియమితులయ్యారు. వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్. రఘునాథరెడ్డి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసర్ షావల్లిఖాన్, కర్నూలు ఉర్దూ యూనివర్శిటీ వీసీగా నియమితులు కావడంతో అతని స్థానంలో ఆమెను నియమించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పోరుమామిళ్ల వాసులు

పోరుమామిళ్ల, జూలై 22: ఆగస్టులో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పోరుమామిళ్ల వాసులు అర్హత సాధించారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. 21న ఆదివారం ప్రొద్దుటూరు దేవాంగ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీ ల్లో సబ్ జూనియర్, సీనియర్ విభాగంలో 32 మంది బంగారు పతకాలు, 16 మంది రజత పథకాలు, 14 మంది కాంస్యపథకాలు, సాధించా రన్నారు. వీరికి ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ శివశంకర్‌రెడ్డి, బహుమతులు అందజేశారని ఆయన తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ ఆకస్మిక తనిఖీ

● 35మందిపై కేసులు నమోదు
● రూ.4లక్షలు జరిమానా



ట్రాన్స్‌ఫార్మర్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జూలై 22: ఎర్రగుంట్ల టౌన్, మండలపరిధి వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 35మందిపై కేసులు నమోదు చేశారు. వారిపై రూ.4లక్షల అపరాద రుసుం విధించారు. విద్యుత్ చౌర్యంపై ఇటీవల ఇన్ని కేసులు పెట్టడం గమనార్హం. తిరుపతి, కడప నుంచి 10 మందితో కూడిన అధికారుల బృందం పరిశ్రమలు, గనులు, మరికొన్ని మేజర్ విద్యుత్ వాడకం ఉన్న వాటిని తనిఖీ చేశారు. తుమ్మలపల్లె, పెద్దనపాడు, నిడిజువ్వి గనులు, టౌన్‌లోని వివిధ పరిశ్రమలు తనిఖీ నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈ ఎ.శ్రీనివాసబాబు, ఈఈ కే.రమేష్, డీఈలు మధుసూదన్‌రావు, మధులత, ఎర్రగుంట్ల ఆపరేషన్ డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈలు నాగరాజు, వీరాంజనేయరెడ్డి, రవికుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మధుసూదనరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

● కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు



మాట్లాడుతున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు తదితరులు

కడప(రూరల్) జూలై 22: మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప కుమారుడు నవదీప్‌పై వన్ టౌన్ ఎస్ఐ మధుసూదనరెడ్డి విచక్షణారహితంగా కొట్టి గాయపరచడం దారుణమని ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు డిమాండ్‌చేశారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన పేరు చెప్పి లాయర్‌గా పరిచయం చేసుకుని తన కుమారుడు నవదీప్‌ను కొట్టడంపై ఎస్ఐని అడిగితే ఆయన నీవు ఎవరివైతే నాకేంటి నీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అతనిపై కూడా దర్పాషలాడడం దారుణమన్నారు. ఎస్ఐ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొట్టే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించా రు. ఎందుకు కొట్టారో విశ్లేషణ ఇవ్వాలన్నారు. ఎస్ఐపై చట్టపర చర్యలు తీసుకుని వెంటనే విధులను నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప, బార్ అసోసియేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్-19 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప (స్పోర్ట్స్) జూలై 22: కడపలో 24వ తేదీ బుధవారం నుంచి ఆగస్టు 19 వరకూ అండర్-19 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ వెల్లడించారు. ఈ మ్యాచ్‌లు రిమ్స్‌సమీప వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగనున్నాయన్నారు. క్రిష్ణా, విశాఖ, చిత్తూరు, కడప, నెల్లూరు, వెస్ట్ గోదావరి, శ్రీకాకుళం జట్లు పాల్గొంటున్నాయన్నారు.

తేదీ	వివిధ జట్లు	ప్రదేశం
24 నుంచి 26	కడప- వెస్ట్‌గోదావరి	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
24నుంచి 26	విశాఖ- చిత్తూరు	కేఎస్ఆర్ఎం
24నుంచి 26	శ్రీకాకుళం- నెల్లూరు	కేఓఆర్ఎం
	జూలై 27 విశ్రాంతి రోజు	
28నుంచి 30	క్రిష్ణా- చిత్తూరు	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
28నుంచి 30	శ్రీకాకుళం- కడప	కేఎస్ఆర్ఎం
28నుంచి 30	విశాఖ- వెస్ట్‌గోదావరి	కేఓఆర్ఎం
	జూలై 31 విశ్రాంతి దినం	
ఆగస్టు 1నుంచి 3	చిత్తూరు- నెల్లూరు	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
ఆగస్టు 1నుంచి 3	క్రిష్ణా- వెస్ట్ గోదావరి	కేఎస్ఆర్ఎం
ఆగస్టు 1నుంచి 3	విశాఖ- శ్రీకాకుళం	కేఓఆర్ఎం
	ఆగస్టు - 4 విశ్రాంతి దినం	
ఆగస్టు 5నుంచి 7	క్రిష్ణా- శ్రీకాకుళం	వైఎస్ రాజారెడ్డి క్రికెట్‌మైదానం
ఆగస్టు 5నుంచి 7	చిత్తూరు-వెస్ట్‌గోదావరి	కేఎస్ఆర్ఎం
ఆగస్టు 5నుంచి 7	నెల్లూరు- కడప	కేఓఆర్ఎం
	ఆగస్టు 8 విశ్రాంతి దినం	
ఆగస్టు 9నుంచి 11	క్రిష్ణా- కడప	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
ఆగస్టు 9నుంచి 11	విశాఖ- నెల్లూరు	కేఎస్ఆర్ఎం
ఆగస్టు 9నుంచి 11	శ్రీకాకుళం- వెస్ట్‌గోదావరి	కేఓఆర్ఎం
	ఆగస్టు 12 విశ్రాంతి దినం	
ఆగస్టు13నుంచి15	క్రిష్ణా- విశాఖ	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
ఆగస్టు13నుంచి15	చిత్తూరు-కడప	కేఎస్ఆర్ఎం
ఆగస్టు13నుంచి15	నెల్లూరు-వెస్ట్‌గోదావరి	కేఓఆర్ఎం
	ఆగస్టు- 16 విశ్రాంతి దినం	
ఆగస్టు17నుంచి19	విశాఖ- కడప	వైఎస్‌రాజారెడ్డి స్టేడియం
ఆగస్టు17నుంచి19	చిత్తూరు- శ్రీకాకుళం	కేఎస్ఆర్ఎం
ఆగస్టు17నుంచి19	క్రిష్ణా- నెల్లూరు	కేఓఆర్ఎం

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

కడప (మారుతీనగర్) జులై 22: జిల్లాలోని వివిధ శాఖల్లో ఖాళీగావున్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సొరకాయల శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో కలెక్టర్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన పేద విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాన్ని కల్పించాలన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో 1వ తరగతికి గిరిజన విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు. గిరిజన తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలపై ప్రత్యేక పరిశీలన చేయించాలన్నారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కడప (సెవెన్ రోడ్స్): జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ వినతి పత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు అందకున్నా సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాంటి వారికి తక్షణమే వేతన బకాయిలు అందేలా చూడాలని కోరారు. రిమ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఆరోగ్యశ్రీ డబ్బులు ఇవ్వాలన్నారు. స్పందించిన కలెక్టర్... జిల్లాలో వున్న సెక్యూరిటీ వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డీసీవోను, రిమ్స్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులకు చెల్లించాల్సిన 8 వారాల కూలి వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా నిర్వహించడం లేదన్నారు. వారం వారం డబ్బులు చెల్లిస్తే కూలీల సంఖ్య పెరుగుతుందని ఉద్దేశ పూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం బకాయిలు సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. నేటి ధరలకు అనుగుణంగా రూ 6 వందల రూపాయలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న శివశంకర్

డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన

● **ఫోన్ ద్వారా 13 ఫిర్యాదుల స్వీకరణ**

కడప(కలెక్టరేట్), జూలై 22: కలెక్టరేట్‌లో ఒకటిన్నర దశాబ్దం తర్వాత సోమవారం నిర్వహించిన డయల్ యు వర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గతంలో కలెక్టర్ కృష్ణబాబు ఈ కార్యక్రమం నిర్వహించేవారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రాలేని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి 10-30 వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గంట వ్యవధిలో 13 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఫోన్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



డయల్ యువర్ కలెక్టర్‌లో కలెక్టర్ లోతేటి శివశంకర్

కలెక్టర్‌కు ముస్లిం నేతల సన్మానం

నాగరాజుపేట, జూలై 22: కడప నగరంలోని గౌస్ నగర్‌కు చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు అమానుల్లా, పఠాన్ ఖాదర్‌బాషా ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ 27వ డివిజన్ పరిధిలో గౌస్ నగర్‌లోని 1.30 ఎకరా భూమి కబ్జాకు గురైందని దానిపై సర్వేచేసి, విచారణ చేయించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని పలు వీధులు చిన్నపాటు వర్షానికే వాగుల్లా మారుతున్నాయన్నారు. కార్పొరేషన్ పనితీరు సరిగా లేదన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంకా వైసీపీ భ్రమలోనే ఉన్నారన్నారు.

పన్ను నిబంధనలు మార్చాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 22: పన్ను నిబంధనలు మారాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ అమ రావతి కార్యాలయంలో పన్ను నిబంధనలు తాజా బ డ్జెట్ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జీవనవ్యయం పెరిగి నందున మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మార్పులు చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా అమలులో ఉన్న స్లాబ్‌లను సైతం తాజా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సవరించాలన్నారు. ఏపీటీఎఫ్ అమరాతి నాయకులు చెంగల్‌రెడ్డి, అలీఖాన్, ఉమాకాంత్, వీర ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేంపల్లె, జూలై 22: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. సోమవారం వేంపల్లెలోని ఇమామ్‌నగర్‌లో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, మురుగు నిల్వలు, నీటితొట్లలో అబెట్ పిచి కారీ చేశారు. ఎంపీహెచ్‌ఈఓ బాబా ఫక్రుద్దీన్, సీహెచ్ ఓ రుక్మిణి, సౌభాగ్య, స్వప్న, నాగేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధన లో వైసీపీ, టీడీపీ దొందూ.. దొందే!

● **తులసిరెడ్డి**

వేంపల్లె, జూలై 22: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో టీడీపీ, వైసీపీ దొందూ దొందే నని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్‌నేత తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదా రాష్ట్రానికి సంజీవిని, హక్కు అన్నారు. ఈ హోదా ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడిదారులు పెట్టుబడులు పెడతారన్నారు. తద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని 2014 ఫిబ్రవరి 20న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏపీకి ఐదు సంవత్సరాలు పత్యేక హోదా ప్రకటించారన్నారు. తర్వాత వచ్చిన టీడీపీ, వైసీపీల చేతగానితనం వల్ల ఈ ప్రకటన అమలు కాలేదన్నారు. ఇటీవల జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీహార్, ఒడిశా రాష్ట్రాలు ప్రత్యేక హోదా అడిగాయన్నారు. కానీ టీడీపీ, జనసేన పార్టీలు ఆ అంశాన్ని ప్రస్తావించిన పాపాన పోలేదన్నారు. మన రాష్ట్రానికి చెందిన టీడీపీ, వైసీపీ, జనసేన బీజేపీ చేతిలో కీలుబొమ్మలు అన్నారు. ప్రత్యేక హోదా ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో పులివెందుల విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్, జూలై 22: బెంగుళూరులో జరిగిన సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్ షిప్-2024లో పులివెందులకు చెందిన యువ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించినట్లు శిక్షకుడు డాకాల గంగాధర్ తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ వారు ఈ పోటీలు నిర్వహించారన్నారు. మినీ సబ్‌జూనియర్ అండర్ - 25కేజీ విభాగంలో నాలుగు గోల్డ్, మూడు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు.

సబ్ జూని యర్ అండర్-30 కేజీ విభాగంలో మూడు గోల్డ్, ఐదు సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మెడల్స్, కేడెట్ అండర్ 45కేజీ విభాగంలో రెడు గోల్డ్, మూడు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. అలాగే సీనియర్ కేటగిరీ విభాగంలో మూడు గోల్డ్, మూడు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్స్ సాధించా రన్నారు. జోనల్ స్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపడం ఆనందంగా ఉందని మాస్టర్ డాకాల గంగాధర్ తెలిపారు.



మెడల్స్ సాధించిన విద్యార్థులతో మాస్టర్ గంగాధర్

వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 22: తెలంగాణ తరహాలో రెండు లక్షల వరకూ రుణమాఫీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎద్దుల ఈశ్వరరెడ్డి హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. రుణమాఫీ చేస్తామని 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు రూ. 50 వేల వరకూ మూడు దశలుగా రుణాలను మాఫీ చేయడంతో పాటు 50 వేలకు పైగా రుణాలకు బాండ్లు ఇవ్వగా, 2019 ఎన్నికల్లో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన నాలుగో విడత, ఐదో విడత బాండ్లను జగన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోనందున రైతులు అప్పుల పాలయ్యారన్నారు. కాగా, ప్రస్తుతం చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి నాలుగో విడత, ఐదో విడతలో మిగిలిపోయిన బ్యాంకు రుణాలను తక్షణమే మాఫీ చేయాలని కోరారు. తెలంగాణ తరహాలో రెండు లక్షల వరకూ బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో మదన పల్లెలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర స్థాయి సమ్మే ళనాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమ్మేళనాలలో రైతులు, కౌలు రైతులు, పాడి రైతులు, ఉద్యాన రైతుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సమ్మేళనాలకు 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నా రన్నారు. సమావేవంలో ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షు డు గాలి చంద్ర, అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య



ఆధార్ నమోదు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం, జూలై 22: ఐదు రోజుల పాటు ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సల్మాన్ రాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ కార్డు అప్డేట్, చిరునామా, ఫోటో మార్పు , ఫోన్ నెంబరు లింక్ చేయుట, వేలి ముద్రలు అప్డేట్ చేయడం తదితర అంశాల సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు. 23 తేదీన నిడివెలగల కస్తూరిబా బాలికల పాఠశాల, అంకాళమ్మగూడూరు జడ్పీ హైస్కూల్, 24న సింహాద్రిపురం జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్, బలపనూరు జడ్పీ హైస్కూల్, 25న గురిజాల ఉన్నత పాఠశాల, కోవరంగుట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, 26న బిదినంచెర్ల ప్రాథమిక పాఠశాల, లోమడ ప్రాథమిక పాఠశాల, 27న హిమకుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల, రావులకొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

వల్లూరు: ప్రభుత్వ, అధికారుల ఆదేశాల మేరకు నేటి నుంచి 27వ తేదీ వరకు గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ తెలిపారు. 2015-16లో తీసుకున్న ఆధార్ కార్డు అప్‌డేట్ చేయడంతో పాటు చిరునామా, అడ్రస్, ఫోటో, వేలిముద్రలు ఇతర వివరాలు అప్‌డేట్ చేస్తారన్నారు. ఈ నెల 23న తొలగంగన్న పల్లెలో, 24న వల్లూరు, 25న కొప్పోలులో, 26న దిగువపల్లెలో, 27న లేబాకలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

వేధింపులు ఆపకపోతే.. ఆందోళనలు ఉధృతం

● **ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి**

కడప (మారుతీనగర్), జూలై 22: జిల్లాలోని ఆశా కార్యకర్తలను ఉద్యోగాలు మాను కోవా లని... లేకుంటే తొలగిస్తామని రాజకీయ నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడు తున్నా రని.. వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా సమితి పిలుపు మేరకు సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సుభాషిణితో పాటు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగ సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. గత 17 సంవత్సరాలుగా జిల్లాలో గర్భిణులకు, బాలింతలకు, నవ జాత శిశువులకు వైద్యసేవలు అందిస్తూ.. పాలక ప్రభుత్వాలు ఇచ్చే సర్వేలను ఎప్పటి కప్పుడు ప్రజలకు చేరవేస్తూ ఆశా కార్యకర్తలు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. అతి తక్కువ వేతనంతో సెలవులు లేకుండా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు విధుల నుంచి తప్పుకోవాలంటూ అధికారులతో నోటీసులు జారీ చేయడాన్ని తప్పు పట్టారు. తక్షణమే అధికారులు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పి స్తామని హామీ ఇచ్చారని.. ఆ హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాదుల్లా, లింగన్న, పి.చంద్రశేఖర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కె.కల్పన, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, కోశాధికారి అమ్ములు, ఉపాధ్యక్షురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్



డ్రైవర్‌కు జైలు శిక్ష .. జరిమానా

కడప క్రైమ్, జూలై 22: మద్యం సేవించి ఆటో నడిపిన డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఈనెల 21న కడప వాసి మోపూరి శివశంకర్ నగరంలో ఆటో తోలుతుండగా బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు నిర్వహించామన్నారు. మద్యం తాగినట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం జడ్జి ముందు నిందితుడిని హాజరు పరచడంతో 21 రోజులు జైలు శిక్ష, రూ 3500 జరిమానా విధించినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలసిన బీసీ సంక్షేమశాఖ అధికారి

కడప(కలెక్టరేట్) జూలై 22: జిల్లా వెనుక బడిన తరతుల సంక్షేమం, సాధికారిక అధికారిగా మొదటిసారిగా వైఎస్సార్ జిల్లాకు నియమితుడైన ఎం.భరత్ కుమార్ రెడ్డి సోమవారం కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిశారు. ఈయన ఐఐటి ఖరగ్ పూర్‌లో బీటెక్‌ను పూర్తి చేసి 2022లో గ్రూప్-1 సర్వీసులకు ఎంపికయ్యారు. కర్నూలు జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకొని వైఎస్సార్ జిల్లాలో నియమితులయ్యారు

డ్యూటీచార్ట్ ఫాలో కాని వీఏఏలపై రిపోర్టు చేయండి

ప్రొద్దుటూరు ,జూలై 22 : విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు డ్యూటీ చార్ట్ ఫాలో కాకుండే ఆయా మండలాల ఏవోలు వారిపై రిపోర్టు పెడితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ సురేష్‌రెడ్డి ఆదేశించారు.సోమవారం మార్కెట్ యార్డులోని ఏడీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాల వీఏఏలు, వీహెచ్ఏ ఎంపీఈవోలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీఏఏలు రైతులను కలిసి వారికి వ్యవసాయ సలహాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించాలన్నారు.ఏడీఏ డివిజన్ గ్రూప్‌లో సమాచారం పెడితే వీఏఏల నుంచి కనీస స్పందన వుండదన్నారు.ఫీల్డుకు వెళితే కనీసం గ్రూప్‌లో ఫొటో పెట్టడానికి కూడా బద్ధకమైతే ఎలా అన్నారు. ఏవోలు నిర్లక్ష్యంగా వుండే వీఏఏలపై లెటర్ పెట్టమన్నారు. వారం రోజులు చూసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు కేవలం రిపోర్టులు ఇచ్చుకుంటూ ఫీల్డుకే వెళ్ళడం లేదన్నారు. గూగుల్ షీట్‌లో కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం లేదన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏవో శివశంకర్ రెడ్డి, పెద్దముడియం ఏవో అరుణ, మైలవరం ఏవో విజయరావు, టెక్నికల్ ఏవో సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



విలేకరులతో మాట్లాడుతున్న తుంగా రమణయ్య

కడప ఎడ్యుకేషన్, జూలై 22: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జనసేన నాయకులు తుంగ రమణయ్య తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నాలుగో విడుత క్రియాశీలక సభ్యత్వ నమోదు జరుగుతుందని చెప్పారు. జనసేన సభ్యత్వం పొందిన వ్యక్తికి రూ 5లక్షల ప్రమాద బీమా ఉంటుందని తెలియజేశారు. వీర మహిళకోసం పవన్‌కళ్యాణ్ ప్రవేశపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాయి, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్, పూల టెండర్లతో గండికి రూ.37లక్షల ఆదాయం

చక్రాయపేట, జూలై 22: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం టోల్‌గేట్ వసూలు, పూలు విక్రయం ద్వారా గండికి రూ. 37.70లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం స్థానిక గండి కార్యాలయంలో ఏసీ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ అధ్యక్షతన టెండర్లు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మారెళ్లమడకకు చెందిన రూ.18.55లక్షలు పాడి టోల్‌గేట్‌ను దక్కించుకున్నారు. అలాగే కొండావాండ్లపల్లెకు చెందిన విజయ్‌కుమార్ రూ.19.15లక్షలు పాడి పూల టెండర్లను దక్కిచుకున్నారు. టెండర్లలో టోల్‌గేట్‌కు 11 మంది, పూలకు 8 మంది టెండర్లు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మన్లు వెంకటస్వామి, భాస్కరుడుతో పాటు భానుకిరణ్, పోతిరెడ్డి పెద్ద చెంద్రాయుడు, శ్రీరామమూర్తి, నాగరజు, పోలీసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



గండి క్షేత్రంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

కడప (సెవెన్‌రోడ్స్) జులై 22. మైనార్టీలలో పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వెనుకబాటుతనం తదితర వాటిని దూరం చేయడానికై రాష్ట్ర వ్యాపితంగా ఆప్ కీ ఆవాజ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆరిఫ్‌ఖాన్, మగ్బూల్ బాషా వెల్లడించారు. సోమవారం స్థానిక ఆప్‌కీ ఆవాజ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు తొలుత వర్క్‌షాపు తాలూకు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మైనార్టీలపై జరుగుతున్న అసత్య, విద్వేష ప్రచారాలను ఎండగడుతూ ప్రజలలో చైతన్యం కలిగించడానికి, లౌకిక వాదాన్ని, మతసామరస్య విధానాలను ప్రచారం చేయనున్నామన్నారు. ఇందులో సుమారు 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ నగర కార్యదర్శి అబిద్ హుస్సేన్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మగ్బూల్‌బాషా

మదనపల్లె ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 22: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్ధంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదం దురదృష్టకరమన్నారు. కొంతమంది భూ కబ్జాదారులు వారి అవినీతి చిట్టా బయటపడుతుందనే ఉద్దేశంతో అధికారుల అండదండలతో ఈ అగ్ని ప్రమాదానికి పాల్పడ్డారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 22: జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలంటూ పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కె. శంకర్ సోమవారం కడప ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం కరువు వలసలు, రైతుల ఆత్మహత్యలకు నిలయం అన్నారు. ఇలాంటి ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ స్థాపించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, ఆదిత్య, సమీర్, సాగర్, బాలాజీ పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతి పత్రం సమర్పిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ ప్రతినిధులు

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన



పోలీస్‌స్టేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కత్తి వెంకటరమణ

వల్లూరు, జులై 22: పోలీసు విధులపై ఎస్ఐ కత్తి వెంకట రమణ సోమవారం విద్యార్థుల కు అవగాహన కల్పించారు. సోమవారం వేదాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ ఆవస్యకతను వివరించారు. పోలీసు అధికా రుల స్థాయిలను వివరించారు. సెట్ కాన్ఫరెన్స్, ఎస్ఐ గది, రైటప్ రూమ్‌లో ఉం డాల్సిన పుసకాలు, కంప్యూటర్ ఆపరేటర్ పనులపై అవగాహన కల్పించారు. లాకప్ గదులు, రివాల్వర్ పనితీరు వివరించారు. పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా ఆహ్వానించి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని వివరించారు. ద్విచక్రవాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు వివరించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లాయపల్లెలో సమగ్ర భూ సర్వే



అట్లూరు, జూలై 22: మండలంలోని నల్లాయపల్లె గ్రామంలో భూములను సమగ్ర సర్వే నిర్వహించినట్లు తహసీల్దారు వేణుగోపాల్ తెలిపారు. నల్లాయపల్లె భూములను కొందరు బద్వేలు, ఇతర మండలాల వారు భూ ఆక్రమణకు పాల్పడడంతో అట్లూరు మండలవాసులు పట్టారులు కలెక్టరేట్‌కు ఫిర్యాదుచేయడంతో సోమవారం సమగ్ర భూ సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కరీముల్లా, వీఆర్వోలు సుబ్బయ్య, దొరబాబు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22: మధుమేహ వ్యాధికి క్రమం తప్పకుండా మందులు వాడడంతోపాటు రోగులు తగిన అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హోమస్‌పేటలోని డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి ఆస్పత్రిలో షుగర్‌వ్యాధి గ్రస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారిన జీవన శైలితో చిన్న వయస్సులోనే షుగర్‌వ్యాధి ప్రబలుతోందని పేర్కొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ సాధనకోసం కృషి చేస్తాం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22: రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కృషి చేస్తామని స్టీల్‌ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఎన్.ఎస్.ఖలందర్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ హామీలను అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో తెలుగుదేశం పార్టీ కీలక భూమిక పోషిస్తున్నందున కడపజిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లు సలీం, కుళాయప్ప, సభ్యులు చంద్ర, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22: టెట్, డీఎస్సీ తెలుగు పండిట్ ఉచిత శిక్షణ తరగతులను అభ్యర్థులను సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, హెచ్‌ఎం రవిప్రకాష్‌లు పేర్కొన్నారు. సోమవారం జేవీవీ కార్యాలయంలో టెట్, డీఎస్సీ తెలుగు పండింట్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ దస్తగిరి, చంటి, జేవీవీ ప్రధాన కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

డేంజర్..!

● మైలవరం జలాశయం గేట్లకు సమీపాన పడిపోయే దిశగా కాలువ ● అధ్వానం ఉత్తర కాలువ

జమ్మలమడుగు, జూలై 22: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం జలాశయం గేట్లకు దగ్గరలో ఉత్తర కాలువ ధ్వంసం అయింది. గతంలో వరదనీటికి పునాదుల నుంచి రాళ్లు కదిలాయి. దీంతో కాలువ పడిపోయే దిశకు చేరుకుంది. గోడరాళ్లన్నీ కదిలి నీళ్లలో పడిపోతున్నాయి. అక్కడి నుంచి ఉత్తర కాలువ వేపరాల, దొమ్మరనంద్యాల, మోరగుడి, తదితర గ్రామాలకు శివార్లలో కాలువ ధ్వంసం అయింది. ఎక్కడ చూసినా రాళ్లు బయట పడి గుంతలు దర్శనమిస్తున్నాయి. అలాగే మైలవరం జలాశయం వద్ద నుంచి జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట, అంబవరం, సున్నపురాళ్ల పల్లె, ఎర్ర గుంట్లకు వెళ్లే ఆర్టీపీపీ దారిలో కన్యతీర్థం వరకు శివార్లలో కాలువ ధ్వంసం అయింది. మూడు సంవత్సరాల క్రితం అధిక వర్షాల వలన పెన్నానదికి ఉత్తర, దక్షిణ కాలువలకు వరదనీరు విడుదల చేయడం వలన ప్రహరీ పునాదులు కదిలి రాళ్లు బయటపడ్డాయి. అందులో జంబు పేరుకుని నీటి ప్రవాహం తగ్గింది. పలుచోట్ల నీళ్లు పక్కదారి పడుతోంది. సంబంధిత అధికారులు పరిశీలించి కాలువలు మరమ్మతులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.





మైలవరం జలాశయం గేట్లకు ఎదురుగా ఉత్తర కాలువ పునాది రాళ్లు పడిపోయిన దృశ్యం

జమ్మలమడుగు-కోవెలకుంట్ల రోడ్డులో ఉత్తర కాలువ పక్కన దర్శనమిస్తున్న గుంతలు

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కొండాపురం, జూలై 22: మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఏవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.ఈ నెల 23 నుంచి 27 వరకు కొండాపురం, లావనూరు, తాళ్లప్రొద్దుటూరు, ఎర్రగుడి ఆధార్ సేవా కేంద్రాల పరిధిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూరు శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకం

బి. కోడూరు, జూలై 22: మండలంలోని పండ్లతోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం మొక్కలను అందిస్తుందని ఎంపీడీవో భాస్కర్‌రావు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి రైతులకు ప్రభుత్వం నూరుశాతం సబ్సిడీతో చిన్న, సన్న కారు రైతులకు మామిడి, చీని, నిమ్మ, సన్న నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి తదితర రకాల పండ్ల మొక్కలను అందిస్తుందన్నారు. రైతులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించి ఉపాధి హామీ జాబ్‌కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకం, సన్న,చిన్నకారు రైతు పత్రం జిరాక్స్ కాపీలు అందించి పండ్ల మొక్కలను నాటుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపీవో రాజ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు సహకరించండి

ప్రొద్దుటూరు క్రైం, జూలై 21 : జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వైద్యాధికారి హిమబిందు అన్నారు. సోమవారం ఆరోగ్యకేంద్రం పరిధిలో టీబీ రోడ్డు, ప్రకాష్‌నగర్, సాయికుటీర్‌రోడ్డుల్లో ఇంటింటా సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, యూపీహెచ్‌ట శివశంకరయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, టీమ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

వీఏఏలు డ్యూటీ చార్ట్ ఫాలో కాకుంటే రిపోర్టు పెట్టండి

డివిజన్ సమావేశంలో ఏవోలను ఆదేశించిన ఏడీఏ సురేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు ,జూలై 22 : విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు డ్యూటీ చార్ట్ ఫాలో కాకుండే ఆయా మండలాల ఏవోలు వారిపై రిపోర్టు పెడితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ సురేష్‌రెడ్డి ఆదేశించారు.సోమవారం మార్కెట్ యార్డులోని ఏడీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాల వీఏఏలు, వీహెచ్‌ఏ ఎంపీఈవోలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీఏఏలు రైతులను కలిసి వారికి వ్యవసాయ సలహాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించాలన్నారు.ఏడీఏ డివిజన్ గ్రూప్‌లో సమాచారం పెడితే వీఏఏల నుంచి కనీస స్పందన వుండదన్నారు.ఫీల్డుకు వెళితే కనీసం గ్రూప్‌లో ఫోటో పెట్టడానికి కూడా బద్దకమైతే ఎలా అన్నారు. ఏవోలు నిర్లక్ష్యంగా వుండే వీఏఏలపై లెటర్ పెట్టమన్నారు. వారం రోజులు చూసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు కేవలం రిపోర్టులు ఇచ్చుకుంటూ ఫీల్డుకే వెళ్ళడం లేదన్నారు. గూగుల్ షీట్‌లో కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం లేదన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏవో శివశంకర్ రెడ్డి, పెద్దముడియం ఏవో అరుణ, మైలవరం ఏవో విజయరావు, టెక్నికల్ ఏవో సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏవోలు

జాతీయ కీటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బి. కోడూరు, జూలై 22: మండల పరిధిలోని ఎస్సీ బాలుర హాస్టల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి విద్యార్థినులకు జాతీయ కీటక జనిత వ్యాధులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై జాగ్రత్తలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యుడు హుస్సేనయ్య,పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, పుష్పాంజలి, నాగమణి, జాన్‌విలియం, ప్రియదర్శిని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22: ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు, ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు జీవోనెం.1 ప్రకారం ఉపాధ్యాయులకు సక్రమంగా వేతనాలు చెల్లించడంలేదని, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాడ్యుటీ సౌకర్యాలు కల్పించడంలేదని తెలిపారు.

కూలిన పురాతన చింతచెట్టు



రోడ్డుకు అడ్డంగా పడ్డ చింత చెట్టు

బి. కోడూరు, జూలై 22 : మండల పరిధిలోని గోవిందాయపల్లె గ్రామ సమీపాన ఉన్న ఎన్నో తరాల చింతచెట్టు సోమవారం ఉన్నట్టుండి కింద పడిపోయింది. దానికి కాలం చెల్లిందో లేక ఏమైందో తెలియదు కానీ ఉన్నట్టుండి కిందకు పడిపోవడంతో గ్రామస్థులను ఆశ్చర్యానికి గురిచేసింది. చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుకు అడ్డంగా పడ్డ చింత చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు అంటున్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు స్పందించండి

రాజుపాళెం, జూలై 22: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్య తదితర వాటిపై అధికారులు తక్షణం స్పందించాలని ఎంపీపీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సభా భవనంలో ఎంపీపీ నారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో షాకీర్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు జరుగుతున్న పనులు తదితర వాటిపై వివరించారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ విషజ్వరాలు ప్రబలకుండా పరిసరా ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మురుగునీరు నిల్వఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కొర్రపాడు సర్పంచు శ్రీనివాసులరెడ్డి, టంగుటూరు సర్పంచు కరుణమ్మ, ఎంపీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

జమ్మలమడుగు, జూలై 22: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు మోటు వద్ద డ్రైనేజీ కాలువ ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల డ్రైనేజీ కాలువ మరమ్మతులకోసం కప్పు రాళ్లను తొలగించారు. అలాగే కాలువలో వ్యర్థాలు నిండుకున్నాయి. నిర్లక్ష్యంగా పనులు చేయకుండా నిలిపివేశారు. దీంతో స్థానికులు వారి వారి ఇళ్లల్లోకి వెళ్లాలన్నా ఆందోళనకరంగా ఉంది. అధికారులు వెంటనే పనులు పూర్తి చేయాలని కాలువ శుభ్రం చేయాలని కోరారు.



పైకప్పు లేకుండా ఉన్న డ్రైనేజీ

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 22: 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉప విద్యాశాఖాధికారి క్రిష్ణప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయన తాళ్లమాపురం జడ్పీ హైస్కూలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీనాథరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కాశినాయన, జూలై 22: అనాధ శవానికి సోమవారం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు వివేకానంద సేవాసమితి సభ్యులు. ఇటీవల ఓఅవ్వను కన్నకొడుకే జ్యోతిక్షేత్రంలో వదిలేసి వెళ్లాడు. ఆమె దీనస్థితిని చూసిన వివేకానంద సేవాసమితి వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి అక్కున చేర్చుకుని ఆశ్రమానికి తీసుకువచ్చాడు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు సోమవారం మృతి చెందడంతో సంస్థ ప్రతినిధులు సచివాలయ ఉద్యోగి మనోజ్, వెంకటేశ్వర్లు, సునీల్ కిరణ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు స్కూటర్లు ఢీ

ఇద్దరికి గాయాలు

ఖాజీపేట, జూలై 22: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని దుంపలగట్టు సమీపంలో స్కూటర్, బుల్లెట్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... మైదుకూరుకు చెందిన చిన్న ఓబుళరెడ్డి, షేక్ నన్నే ఇద్దరు పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా దుంపలగట్టు సమీపంలోకి రాగానే బుల్లెట్‌లో అతివేగంగా వస్తూ ముందు వెళుతున్న స్కూటర్‌ను ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మైదుకూరు ఆస్పత్రికి తరలించారు. ఆమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులు పట్టించుకోవడంలేదు

ఎస్పీ కార్యాలయం స్పందనలో ఫిర్యాదు చేసిన బాధితులు

జమ్మలమడుగు, జూలై 22: స్థానిక రామిరెడ్డిపల్లె రోడ్డు డోర్‌నెం.21/1021-6 ఇంట్లో నివాసమున్న అన్నలయ అనిత ఆమె భర్త ఎ.నరసింహాచార్యులు చోరీ కేసులో జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో పోలీసులు అన్యాయం చేసి పట్టించుకోవడంలేదని సోమవారం ఎస్పీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. తమకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం. కుటుంబ సభ్యులతో కలిసి కాశీకి వెళ్లామన్నారు.2024 మే11న ఇంటికి చేరుకునే సరికి తమ ఇంట్లో దొంగలు పడి బీరువా, కబోర్డు తాళాలు పగులకొట్టి 30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. అదే రోజు జరిగిన చోరీ ఘటనకు సంబంధించి అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కరుణాకర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. ఆరోజు సీఐ తమతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పి ఐదు రోజుల తర్వాత పోలీసు స్టేషన్‌కు పిలిపించారన్నారు. తర్వాత క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ పరిశీలన మాత్రం పోలీసు అధికారులు పట్టించుకోలేదని తెలిపాడు. 2024 మే21న 454/2024నంబరుతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి అందులో 20 తులాలు మాత్రమే చోరీ జరిగినట్లు చూపించారన్నారు. వాటి విలువ రూ.2.40 లక్షలు చూపించి తక్కువ తీవ్రత కేసుగా మార్చారని వాపోయారు. ఈ విషయమై అప్పట్లో జమ్మలమడుగు డీఎస్పీ పరిశీలించమని కోరారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. సీఐ కరుణాకర్ న్యాయం చేస్తానని ఎక్కడికీ వెళ్లవద్దని చెప్పి ఇటీవల స్టేషన్‌కు వెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోయాడు. రాత పూర్వకంగా జిల్లా అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదును జమ్మలమడుగు ఇన్‌చార్జి డీఎస్పీ ప్రొద్దుటూరు రెగ్యులర్ డీఎస్పీ మురళీధర్‌కు పంపుతున్నట్లు వారు తెలిపారు. వెంటనే ప్రొద్దుటూరులోని డీఎస్పీ కార్యాలయం వద్దకు తాము వెళ్లి అర్బన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన విషయాన్ని తెలపగా డీఎస్పీ మురళీధర్ జమ్మలమడుగు అర్బన్ సీఐ కరుణాకర్‌పై చార్జిమెమో జారీ చేసి 30 తులాలు కేసులో రాయాలని ఆదేశించినట్లు బాధితులు తెలిపారు. ఇలాంటి కేసులు నాలుగేళ్లగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కోకొల్లలున్నట్లు తెలుస్తోంది. గత నెలలో గూడెం చెరువుకు చెందిన మరో ఇద్దరు బాధితులు పోలీసు స్టేషన్‌లో, డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అర్బన్ పోలీసు యంత్రాంగంపై జిల్లా అధికారులు నిఘా పెట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా శెట్టివారిపల్లె మార్గం

● వర్షాలు వస్తే దారి బంద్ ● పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు ● పరిష్కారానికి ఎదురుచూపులు

ముద్దనూరు జూలై22: ముద్దనూరు మండలంలో మారుమూల గ్రామం శెట్టివారిపల్లె. ఈ గ్రామం తాడిపత్రి వైపు నేషనల్ హైవే నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో కొండ ప్రాంతంలో ఉంది.ఈ గ్రామానికి వెళ్లాలంటే దారిలో అడుగడుగునా ఇబ్బందులు తప్పవు.వివరాల్లోకి వెళితే...శెట్టివారిపల్లె గ్రామం పేరుకే గ్రామ పంచాయతీ ఇక్కడ కనీస వసతులులేవు. దాదాపు 250 కుటుంబాలు ఉండగా 700 మంది ఓటర్లు, దాదాపు 2000 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామ ప్రజలను సమస్యలు వెంటాడుతున్నాయి.గ్రామం కొండ ప్రాంతంలో ఉండటమే కాకుండా గ్రామంలోకి వెళ్లాలంటే దారి కూడా సరిగాలేదు.గాలేరు-నగిరి కాల్వ గ్రామం ముందు నుంచి వెళ్లడం ఒక సమస్య అయితే, రైల్వే బ్రిడ్జి నుంచి వెళ్లడం మరో సమస్య. వర్షాలు కురిస్తే బ్రిడ్జి క్రింద వర్షపు నీరు చేరుతుంది.దీంతో ప్రజలు గ్రామం నుంచి పని నిమిత్తం ఇతర ప్రాంతాలకు నడిచి, వాహనాల్లో వెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పదు.అంతే కాకుండా గాలేరు-నగిరి కాల్వపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి కోతకు గురవుతోంది.ఈ సమస్యతో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారు.గ్రామ ప్రజల సమస్యలను పట్టించుకొనే అధికారులు, ప్రజాప్రతినిధులులేరు.కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో సమస్యల పరిష్కారం కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.





రైల్వే బ్రిడ్జి క్రింద చేరిన వర్షపు నీరు, గాలేరు-నగిరి కాల్వ పై కోతకు గురౌతున్న బ్రిడ్జి